క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్



పెబ్బేరు రూరల్: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. జిల్లా కోశాధికారి రాజు మాట్లాడుతూ చాలిచాలనీ వేతనాలతో పనిచేస్తున్న కార్మికులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసి సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని లేకుంటే వర్షకాలం సీజన్‌లో కార్మికులు మరోమారు ఆందోళన బాట తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పెంటయ్య, రామచంద్రయ్య, రాములు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



కొత్తకోట: పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థిని పి.సౌమ్యశ్రీ జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి 6,931 ప్రిపరేటర్ ర్యాంక్ దీంతో ప్రిన్సిపాల్ మాలతి, ఉపాధ్యాయ బృందం సోమవారం ఆమెను శాలువాలతో సత్కరించి అభినందించారు. రానున్న రోజుల్లో చదువులో మంచి ప్రతిభ కనబర్చి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

వనపర్తికి ప్రయోజనం చేకూర్చాలి

వనపర్తిటౌన్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా గెలిచిన మల్లురవి వనపర్తి నియోజకవర్గానికి ప్రయోజనం చేకూరేలా ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని పీసీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మల్లురవిని కలిసి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్ బ్రహ్మం, రామ్‌రెడ్డి ఉన్నారు.

హైదరాబాద్ తరలిన కార్మికులు



ఆత్మకూర్: ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు అజయ్ అన్నారు. సోమవారం ఆత్మకూర్, అమరచింత, మదనపూర్ మండలాల ఉపాధి కూలీలు, ఫీల్డ్‌అసిస్టెంట్లతో కలసి హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రసదస్సుకు తరలివెళ్లారు. ఫీల్డ్ అసిస్టెంట్లుకు పనిభారం తగ్గించాలని, గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి బడ్జెట్లో నిధుల కేటాయింపును కుదిస్తు వస్తున్నారని పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారని ఆరోపించారు. ప్రతిఒక్కరికి జాబ్‌కార్డు ఇవ్వాలని, 200 రోజుల పనికల్పించాలని, పని ప్రదేశాల్లో టెంట్లు, తాగనీటి సౌకర్యం కల్పించాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

పాన్‌గల్: వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఏఎన్‌ఎం సుమిత్ర అన్నారు. సోమవారం మండలంలోని శాగాపూర్‌లో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేసి జాగ్రత్తలను వివరించారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించాలని, గర్భిణులు, బాలింతలు వైద్యుల సూచనల మేరకు మందులను వాడాలన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ఆత్మకూర్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, టై, బెల్టు, షూస్, యూనిఫాం విక్రయిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. నిబంధనలు పాటించని పాఠశాలల యాజమన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివ, నరేష్, విద్యార్థులు ఉన్నారు.



అధ్వానంగా లింకు రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బీటీగా మార్చాలని వేడుకోలు



సూగూరు-పెంచికలపాడుకు వెళ్లే లింకురోడ్డు



శ్రీరంగాపురం నుంచి శేరుపల్లి వెళ్లే లింకు రోడ్డు

పెబ్బేరు రూరల్: మండలంలోని పలు గ్రామాల లింకు రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు, రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్నా రోడ్లను బాగు చేయడంలో పూర్తిగా విఫలం అవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సూగూరు నుంచి పెంచికలపాడు, రామమ్మపేట నుంచి రాంపురం, శ్రీరంగాపురం నుంచి శేరుపల్లి, పాతపల్లి నుంచి కొత్తసూగూరు, నాగసానిపల్లి నుంచి పాతపల్లి, గుమ్మడం నుంచి తిప్పాయిపల్లి, కంచిరావుపల్లి నుంచి తండాకు, వెళ్లే లింకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అసలే వర్షాకాలం సమీపిస్తుండంతో రాకపోకలకు మరింత ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంది. పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి నుంచి తండా వరకు దాదాపు 5కిలోమీటర్లు మేరకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా బీటీ రోడ్డు నిర్మించేందుకు 4ఏళ్ల కిందట కంకర పరిచారు. నాటి నుంచి పనులు చేయడం మరిచారు. సూగూరు నుంచి పెంచికలపాడు వరకు 3 ఏళ్ల కింద మట్టి రోడ్డు మంజూరైంది. కల్వర్టులు నిర్మాణం చేసి అక్కడక్కడ మట్టి కొట్టించి మధ్యలో నిలిచిపోయింది. అధికారులు స్పందించి రోడ్లకు తక్షణమే మరమ్మతు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

పనులు అడ్డుకున్న మున్సిపల్ సిబ్బంది

అమరచింత: ఏళ్ల తరబడి ఉన్న విద్యుత్ స్తంభాన్ని సైతం కాంపౌండ్‌వాల్ లోపలికి తీసుకుంటూ నిర్మాణం చేపడుతుండగా మున్సిపల్ అధికారులు పనులను అడ్డుకున్నారు. పట్టణంలోని 9వ వార్డులోని మంగ గోవర్ధన్ తన ఇంటి ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో కాంపౌండ్‌వాల్ నిర్మించుకునేందుకు శ్రీకారం చుట్టాడు. విద్యుత్ స్తంభానికి ఆనుకుని పునాది తీస్తుండగా విషయాన్ని కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం తమ సిబ్బందిని ఘటనా స్థలానికి పంపి పనులను అడ్డుకోవాలని ఆదేశించారు. ఆర్ఐ కృష్ణయ్య పునాది తీత పనులను నిలిపి వేయాలని సూచించారు. దీంతో ఇరువురి మధ్య మాటామాట పెరిగి వాదోపవాదాలకు దారి తీసింది. తన వద్ద డాక్యుమెంట్ ప్రకారం ఉన్న కాంపౌండ్ వాల్ నిర్మించుకుంటున్నానని తన స్థలంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని అక్రమంగా విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేశారని గోవర్ధన్ మున్సిపల్ అధికారులకు చెప్పాడు. ఆధారాలు ఉంటే మున్సిపల్ కమిషనర్‌కు చూపి పనులను చేసుకోవాలని, అప్పటి వరకు పునాది పనులు నిలిపి వేయాలని కోరడంతో పనులను నిలిపి వేశారు.



పనులు నిలిపివేయాలని చెబుతున్న సిబ్బంది

జాతీయస్థాయిలో ప్రదర్శనకు అవకాశం

జడ్చర్ల టౌన్: తిరుపతిలో ఈనెల 20నుంచి అభినయ ఆర్ట్స్ హనుమ అవార్డ్స్ నిర్వహించే జాతీయ స్థాయి పద్యనాటక ప్రదర్శనలో.. జడ్చర్ల నవజ్యోతి కళానిలయానికి అవకాశం లభించిందని రాష్ట్ర సంగీతనాటక అకాడమీ మాజీ చైర్మన్ బి. శివకుమార్ తెలియజేశారు. 9రోజుల పాటు నిర్వహించే ప్రదర్శనలో నవజ్యోతి కళానిలయం తరపున మైరావణ పద్యనాటక ప్రదర్శన చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం అభినయ ఆర్ట్స్ హనుమ అవార్డ్స్ ప్రతినిధులు లేఖను పంపించినట్లు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దుమృతి

భూత్పూర్: మండలంలోని కర్వెనలో సోమవారం విద్యుత్‌షాక్‌తో ఎద్దుమృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. రైతు మల్లారెడ్డి వ్యవసాయ పొలం సమీపంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఉందన్నారు. కాగా భూమికి కొద్ది ఎత్తులో ఉండగా గడిమేసుకుంటూ వెళ్లిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు వివరించారు. దీంతో రూ.65వేలు నష్టం వాటిల్లిందన్నారు. మల్లారెడ్డిని ఆదుకోవాలని కోరారు.

మూత‘బడులు’ తెరుచుకునేనా?



మూతబడిన మంగళ్లపల్లి ప్రాథమిక పాఠశాల

పాన్‌గల్: మండలంలోని పలు గ్రామాలల్లో విద్యార్థులు లేరనే సాకుతో మూతబడిన ప్రభుత్వ పాఠశాలలు ఈ విద్యాసంవత్సరంలోనైనా తెరుచుకునేనా అనే సందేహం ఆయా గ్రామాల ప్రజలకు కలుగుతుంది. ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్న తల్లిదండ్రులను ఒప్పించి వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

మూతబడిన పాఠశాలల వివరాలు

మండలంలో దావాజిపల్లితండా, మంగళ్లపల్లి(నిజామాబాద్), బీసీకాలనీ రేమద్దుల, కిష్టాపూర్, గన్యానాయక్‌తండా, గురిగింజమిట్టతండా ప్రాథమిక పాఠశాలలు విద్యార్థులు లేక మూతబడి ఏళ్లు గడుస్తున్నాయి. వీటితో పాటు ఇంకా చాలా పాఠశాలలు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నారని మూసివేసే దశలో ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడి విద్యా ప్రమాణాలు తగ్గిపోవడం వల్లనే పల్లె బడులకు ఈ దుస్థితి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

భూత్పూర్: పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని విండో సీఈఓ రత్నయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీఏపీ, యూరియా తదితరాలను సరిపడా రైతులకు సరఫరా చేయనున్నట్లు వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘననివాళి

జడ్చర్ల టౌన్: సంస్కార భారతి వ్యవస్థాపకుడు యోగీంద్రజీ వర్ధంతి పురస్కరించుకుని సోమవారం జడ్చర్ల అనురాగిణి ఆశ్రమంలో ఘన నివాళి అర్పించారు. సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీహెచ్‌పీ నాయకుడు జగ్‌పాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆయన కృషిచేశారన్నారు. దేశభక్తి పెంపొందించటానికి సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు.

హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు అందజేత



ఖిల్లాఘనపురంలో పుస్తకాలు ఇస్తున్న ఎంఈఓ



ఆత్మకూర్‌లో పుస్తకాలను అందిస్తున్న ఎంఈఓ

ఖిల్లాఘనపురం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ ఉషారాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను గ్రామ స్థాయిలో తల్లిదండ్రులకు వివరించాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు రాములు వెంకటేష్, పార్వతమ్మ, ఐఈఆర్‌పీలు రజిత, మల్లేశ్వరి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలను సిద్ధంగా ఉంచుతున్నామని ఎంఈఓ భాస్కర్‌సింగ్ తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు 31 పాఠశాలలకు గాను 48వేల పుస్తకాలను పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో సీఆర్పీ సౌమ్యరాణి, హెచ్‌ఎంలు ఉన్నారు.

అధ్యక్షుడిగా రాజేందర్‌గౌడ్

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి కల్లుగీత సహకార సంఘం అధ్యక్షుడిగా బి.రాజేందర్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఎక్సైజ్ సహకార సంఘం అధికారి రాఘవేంద్రరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించి 11 మంది సభ్యులు ఉన్న సొసైటీలో 5 డైరెక్టర్ పోస్టులకు నామినేషన్లు స్వీకరించారు. 5 మంది మాత్రమే నామినేషన్లను దాఖలు చేయడంతో సొసైటీ ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అధ్యక్షుడిగా బి.రాజేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా జి.భాస్కర్‌గౌడ్, కార్యదర్శిగా జి.సతీష్‌గౌడ్, డైరెక్టర్లుగా నర్సిములుగౌడ్, ఈ.ఖాజన్‌గౌడ్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



రాయినిపల్లిలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



రంగాపురంలో..



వీరాయిపల్లిలో..

పాన్‌గల్: నాణ్యమైన విద్య కోసం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని మాందాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీరామ్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం రాయినిపల్లి, దావాజిపల్లితండా, కేతేపల్లి కాంప్లెక్స్ పరిధిలో చిక్కేపల్లి, వెంగళాయిపల్లిలో ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమం నిర్వహించారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలను వివరించారు.

ఆత్మకూర్: ప్రైవేట్ పాఠశాలలకంటే ప్రభుత్వ పాఠశాలలే ఎంతోమేలని ఎంఈఓ భాస్కర్‌సింగ్, సీఆర్పీ సౌమ్యరాణి అన్నారు. సోమవారం ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాలమేరకు మండలంలోని గ్రామాల్లో బడిబయటి విద్యార్థుల వివరాలను నమోదును ముమ్మరంగా చేపట్టారు.

అమరచింత: బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం బలరాముడు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి కొంకన్వానిపల్లె, పాంరెడ్డిపల్లెలో తల్లితండ్రులకు అవగాహన కల్పించారు.

కొత్తకోట రూరల్: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని బలిజపల్లి హెచ్‌ఎం మంజులత అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లి, వీరాయిపల్లి, బలిజపల్లిలో హెచ్‌ఎం ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, రాంచందర్, మధుసూదన్, నాగరాణి తదితరులు ఉన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల దత్త కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ నిర్వాహకులు సోమవారం ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు కాలభైరవ పశుపత హోమాలు, రెండో రోజు కోటిలింగేశ్వరస్వామికి పుష్పాభిషేకం, బిల్వాభిషేకం, మూడో రోజు జ్ఞానాంభికదేవికి పుష్పాభిషేకం , నాల్గవ రోజు శివపార్వతుల కల్యాణం ఉంటుందని ఆలయ ప్రధాన కార్యదర్శి రుమాళ్ల శేఖర్ తెలిపారు. ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మల్లికార్జునస్వామి, అర్చకులు జగదీష్, అనిల్, శివ తదితరులు ఉన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఎండీ.జబ్బార్

పాన్‌గల్: యువతకు అన్ని రంగాలల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, డీవైఎఫ్ఐ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు జబ్బార్ అన్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో డీవైఎఫ్ఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు అన్ని ప్రభుత్వ రంగాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కులం, మతం పేరిట ప్రజల మధ్య చిచ్చు పెట్టే విధానాలకు స్వస్తి పలకాలన్నారు. ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలన్నారు. డీవైఎఫ్ఐ పేద ప్రజలు, విద్యార్థుల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. శిక్షణ తరగతులు రెండు రోజుల పాటు కొనసాగుతాయన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, భాస్కర్‌గౌడ్, ఖాజా, శ్రీధర్ యాదవ్, నాగరాజు తదతరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొత్తసూగూరు ఉర్సు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



దుకాణాల వద్ద భక్తుల కోలాహలం

పెబ్బేరు రూరల్: మండలంలోని కొత్త సూగూరులో హజరత్ సయ్యద్ ఫకీరుల్లా షాఖాద్రీ దర్గాలో ఉర్సు సందర్భంగా దర్గా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాలకు అతీతంగా దర్గాలో ప్రతి సంవత్సరం ఉర్సు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉత్సవాలలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు చేరుకొని దర్గాలో ప్రార్ధనలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.

భూముల కబ్జాపై చర్యలు తీసుకోండి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: పట్టణంలో లేఅవుట్ల ద్వారా ప్రభుత్వానికి కేటాయించిన 400లకుపైగా 10 శాతం ప్లాట్లు అన్యాక్రాంతమయ్యాయని రూ.5 కోట్లకు పైగా అక్రమంగా అర్జించారని టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్ ఆరోపించారు. సోమవారం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు, కమిషనర్ కలిసి 400లకు పైగా ప్లాట్లను అసెస్‌మెంటు నంబర్లు ఇచ్చి బినామీల పేరిట అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. ఆ ప్లాట్లను రూ.3 లక్షల నుండి రూ.10లక్షల వరకు ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయించి అమ్ముకున్నారని చెప్పారు. అలాగే పరమేశ్వరస్వామి చెరువ కట్టవద్ద శిఖ భూమిలో షాపులను నిర్మించారని, పరమేశ్వర స్వామి ఇనాం భూమిని ప్లాట్లుగా విక్రయించారని, వేంకటేశ్వరస్వామి భూమిలో ప్లాట్లుచేసి అమ్ముకున్నారని, హైటెక్ టాకీస్ వద్ద గోటౌన్ భూమిలో నిర్మాణాలు చేపట్టారన్నారు. పూర్తి ఆధారాలతో కలెక్టర్, కమిషనర్, తహసీల్దార్, సీఐ, ఎస్ఐ, విజిలెన్సు అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, గంగాధర్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తులసిరాజ్‌యాదవ్, పరమేష్, శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

హమాలీ రేట్లు పెంచాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: పౌరసరఫరాల సంస్థ, జీసీసీ హమాలీ ఎగుమతి దిగుమతి నూతన రేట్ల ఒప్పందానికై హమాలీ కార్మిక సంఘాలతో చర్చలు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి నాగేశ్వర్‌కు వినతి పత్రం అందజే శారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ హమాలీలు అందరూ అట్టడుగువర్గాలకు చెందిన పేదలేనని తెలిపారు. కార్మికులను ఆర్థికంగా ఆదుకునేలా ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా 2024–25 సంవత్సరాల ఎగుమతి దిగుమతి కొత్త రేట్లను ప్రస్తుతం ఉన్న రూ.26 నుంచి రూ.35 పెంచి వెంటనే ఒప్పందం చేయాలన్నారు. కార్యక్రమంలో రాములు, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు



డ్రెయినేజీ కోసం తవ్విన కాల్వ

అమరచింత: పట్టణంలోని రెండో వార్డులో డ్రెయినేజీ నిర్మాణం కోసం వీధిలో రహదారిని తవ్వారు. తవ్విన ప్రదేశంలో సిమెంట్ బెడ్ వేసి ఏడాది గడుస్తున్నా ఇప్పటికి పనులు చేపట్టడం లేదు. దీంతో కాలనీ వాసులు వార్డు కౌన్సిలర్ లావణ్యను పలుమార్లు అడుగగా కాల్వ నిర్మాణం కోసం ఎస్టిమేషన్ జరగలేదని దీనికోసం మున్సిపల్ చైర్‌పర్సన్, ఏఈకి విన్నవించామన్నారు. రెండో వార్డులోని గోల్లవిష్ణువర్ధన్ యాదవ్ ఇంటి నుంచి డ్రెయినేజీ నిర్మాణం కోసం తవ్విన ప్రాంతంలో కొత్త డ్రెయినేజీని నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. తవ్వి వదిలేయడంతో రాత్రుల్లో గుంతల్లో పడి గాయల పాలవుతున్నారని తెలిపారు. ఇప్పటికైన తమ కాలనీలో అసంపూర్తిగా ఉన్న పనులను చేపట్టాలని కోరుతున్నారు.